AUCHITHYAM
(A Monthly Peer-Reviewed Online Telugu Research Journal)
Language & Literature | Linguistics | Arts & Humanities | Social Sciences
ISSN 2583-4797 (Online)
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM | Volume-06 | Issue-11 | September 2025 | Peer-Reviewed | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2025/sep_2025/full_papers/september25_07.php
DOI: https://doi.org/10.5281/zenodo.17216853

7.ధ్రువోపాఖ్యానం:నాయకత్వలక్షణాలు

డా. దొడ్డి ప్రవీణ
తెలుగు అధ్యాపకులు,
ఎస్. వి. ఎల్. ఎన్. ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
భీమునిపట్నం, విశాఖపట్నం జిల్లా , ఆంధ్రప్రదేశ్.
సెల్: +91 9290441535. Email: praveenaphdtelugu@gmail.com

సమర్పణ (D.O.S): 20.08.2025 **ఎంపిక (D.O.A): 30.08.2025** **ప్రచురణ (D.O.P): 01.09.2025**

వ్యాససంగ్రహం

నాయకత్వం (Leadership) అనేది కేవలం అధికారంలో ఉండటం కాదు. నాయకుడు అనేది తనలోని సంకల్పాన్ని, ధైర్యాన్ని, ధర్మాన్ని, వినయాన్ని, ప్రజలపట్ల అనురాగాన్ని, గురువుపట్ల భక్తిని కలిగివుండాలి. ధ్రువుడు చిన్న వయస్సులోనే ఈ గుణాలను ఆచరించి, నాయకత్వానికి ఒక అద్భుతమైన ఆదర్శంగా నిలిచాడు. ధ్రువుని కథలో అనేక నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్నాయి. నేటి యువత వాటి గురించి తెలుసుకోవాలి అనే ఉద్దేశంతో చేసిన ప్రయత్నం ఈ పరిశోధనా పత్రం. వి. రావు పోతన భాగవతం భక్తి, నాయకత్వ లక్షణాలు అనే అంశంపై 2015లో journal of Telugu studiesలో పరిశోధనా వ్యాసాన్ని రాశారు. Indian Journal of Philosophiలో పి. సుబ్రహ్మణ్యం "Leadership in Puranas" అనే అంశంపై పరిశోధనాపత్రాన్ని 2007లో రాశారు. A. శర్మ 2018లో "Leadership in Indian epics A comparative study" అనే సిద్ధాంత గ్రంధాన్ని రాశారు. కె. ఎన్. రెడ్డి "Leadership and Devotion: The Dhruva Narrative in Telugu Bhāgavata Tradition." (Journal of South Asian Literature).లో తెలిపిన ధృవుని నాయకత్వ లక్షణాల ఆధారంగా ఈ వ్యాసంలో నాయకత్వ లక్షణాలను వివరించడం జరిగినది.

Keywords: నాయకత్వగుణాలు, సంకల్పం, గురుభక్తి, దైవభక్తి, ధైర్యం, వినయం, ప్రజాహితం, రాజ్యపాలన

1. ప్రవేశిక

భాగవతపురాణం భారతీయ సాంస్కృతికసంపదలో ఒక మహోన్నత గ్రంథం. ఇది వేదవేద్యమైన శ్రీకృష్ణుని మహిమను వివరించే మహాపురాణం. తెలుగుసాహిత్యంలో ఈ గ్రంథాన్ని భక్తకవి పోతనమాత్యుడు అపూర్వమైన భక్తిరస, కవిత్వరసాలతో అలంకరించాడు.

భాగవతంలోని ప్రతికథలోనూ నాయకత్వం, ధర్మపాలన, ఆధ్యాత్మికత వంటి అంశాలు దృశ్యమానమవుతాయి. అందులో ధ్రువునిగాథ ప్రత్యేకస్థానాన్ని ఆక్రమిస్తుంది. ఐదేళ్ల చిన్నవయసులోనే తన ఆత్మగౌరవం నిమిత్తం, తల్లి గౌరవం నిమిత్తం, భక్తి మార్గంలో సాధన నిమిత్తం అడవికి వెళ్లి కఠోర తపస్సు చేసిన ధ్రువుడు, సంకల్పబలం, ధైర్యం, భక్తి, గురుభక్తి లాంటి గుణాలతో నాయకత్వానికి ఆదర్శంగా నిలిచాడు.

2. ధ్రువుని నాయకత్వగుణాలు

ధ్రువుని కథలో నాయకత్వం అనేక కోణాలలో కనిపిస్తుంది. పోతన భాగవతంలోని పద్యాలు ఈ గుణాలను అద్భుతంగా ప్రతిబింబిస్తాయి.

2.1. సంకల్పం

సురుచి అవమానం ధ్రువుని కృంగదీయలేదు. అతను దీన్ని ఒక అవకాశంగా తీసుకొని తపస్సు మార్గాన్ని ఎంచుకున్నాడు.

ధ్రువుడు ఐదు సంవత్సరాల వయస్సులోనే అరణ్యానికి బయలుదేరాడు. ఇది ఒక చిన్నవాడి అద్భుతమైన సంకల్పబలం.

> **వ. "పరమార్థ ప్రాప్తి హేతుకంబులైన తల్లి వాక్యంబులు విని తన్ను, దాన నియమించుకొని పురంబువెడలి చను" (పోతన 59)**

తల్లి మాటలు విని తపస్సు చేయాలని నిర్ణయించుకొని పట్టణాన్ని విడిచి వెళ్ళాడు.

> **చ. అతఁడు నన్యదృష్టిని జరాచర దేహశరీర ధారణా**
> **స్థితి గల యీశునందుఁ దన జీవితమున్ ఘటియింపఁ జేసి యే**
> **కతఁ గనఁ దన్నిరోధమునఁ గైకొని కంపము నొందె నీశ్వరం:**
> **డతఁడు చలింప నిజ్జగము లన్నియుఁ జంచల మయ్యె భూవరా! (పోతన 68)**

శ్రీహరి పాదాలను ఆశ్రయించాలనే సంకల్పం గట్టిగా ఉండటంతో శ్వాసను నిరోధించడం వల్ల శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. ఆయన కనిపించగానే అఖిల లోకాలు ప్రకంపించాయి. ఈ సంకల్పం ధ్రువుని నాయకుడిగా తీర్చిదిద్దింది.

2.2. గురుభక్తి

నాయకత్వానికి రెండవ గుణం గురుభక్తి. ఎవరైనా నాయకుడు కావాలంటే ముందుగా శిష్యత్వం అలవర్చుకోవాలి.

ధ్రువుని మార్గంలో దేవర్షి నారదుడు ఎదురయ్యాడు. చిన్నవాడైనప్పటికీ నారదుని పట్ల గౌరవంతో వంగి నమస్కరించాడు. నారదుడు మొదట అతన్ని పరీక్షించడానికి, "బిడ్డా, ఇది కష్టం. నీ వయస్సుకు తగదు. వదిలేయి" అని అన్నాడు. కానీ ధ్రువుడు వెనక్కి తగ్గలేదు.

> **వ. "త్రిభువనోత్కృష్టంబు ననన్యాధిష్ఠితంబు నగు పదంబును బొంద విచ్చించిన నాకు**
> **సాధుమార్గంబు వెఱింగింపుము; నీవు భగవంతుండగు వఱుని యూరుపు వలన జనించి**
> **వీణావాదన కుశలుండవై జగద్ధితార్థంబు సూర్యుండుమంబోలె వర్తింతు వనిన విని "**
> **(పోతన 61)**

మూడు లోకాల్లోనూ శ్రేష్ఠమైనది, ఇతరులు ఎవరూ పొందలేనిది అయిన స్థానాన్ని ధ్రువుడు పొందాలని ఆశించాడు. దానికి చక్కని ఉపాయాన్ని ఉపదేశించమని నారదుని కోరాడు. ఇది ఒక నాయకుడి వినయం. సవాళ్లను ఎదుర్కొంటూ కూడా గురువు ఉపదేశాన్ని స్వీకరించడం ధ్రువుని నాయకత్వంలోని అసాధారణ గుణం.

2.3. దైవభక్తి

తపస్సు ఫలితంగా ధ్రువుని ముందు శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయ్యాడు. ఇది అతని ఆధ్యాత్మిక నాయకత్వానికి పరాకాష్ఠ.ధ్రువుడు ముందుగా రాజ్యాన్ని కోరుకున్నాడు. కానీ విష్ణువు ప్రత్యక్షమయ్యాక అతని మనస్సు మారిపోయింది.

> **మ. ధనహీనుండు నృపాలుఁ జేరి మిగులన్ ధాటిన్ ఫలీకార మి**
> **మ్మని యర్థించిన రీతి ముక్తి ఫలదుం డైనట్టి పంకేజ లో**
> **చనుఁడే చాలఁ బ్రసన్నుఁడైన నతనిన్ సాంసారికం బర్థిఁల గో**
> **న నావంటి విమూఢమానసులు ధాత్రిం గల్గిరే యెవ్వరున్? (పోతన 77)**

ధ్రువుడు మోక్ష ప్రదాత అయిన పుండరీకాక్షుడు సాక్షాత్కరింపగా సంసారాన్ని అర్థించినందుకు బాధపడ్డాడు. ఈ పద్యం ఒక చిన్నవాడి అనుభూతి పరివర్తనను ప్రతిబింబిస్తుంది. ప్రారంభంలో ఆత్మగౌరవం కోసం తపస్సు చేసిన ధ్రువుడు, చివరికి భక్తి పథంలో మునిగిపోయాడు. నాయకుడు తన ప్రయోజనం కోసం కాక, సమాజ ప్రయోజనం కోసం పనిచేయాలని ఈ పద్యం తెలియజేస్తుంది.

2.4. ధైర్యం

తపస్సులో మాత్రమే కాదు, యుద్ధరంగంలో కూడా ధ్రువుడు అపారమైన ధైర్యాన్ని చూపించాడు. అసురులతో యుద్ధంలో ఆయన చిన్న వయస్సులోనూ అసాధారణ వీరత్వాన్ని ప్రదర్శించాడు.

> **ఉ. వారు లలాటముల్ వగిలి వారక పోలియుఁ తేడి యమ్మహో**
> **దారు పరాక్రమ ప్రకట ధైర్యముఁ దక్కర లాఘవంబుఁ బ**
> **ల్మాటు నుతించుచుం గుపితమానసులై పదతాడితప్రదు**
> **ష్టోరగకోటి వోలెఁ జటులోగ్ర భయంకర రోషమూర్తులై. (పోతన 83)**

ధ్రువుడు ప్రయోగించిన బాణాలు యక్షుల నొసళ్లు పగలగొట్టి వారిని మూర్ఛపోయేలా చేశాయి. వారు తిరిగి తేరుకుని, ఆ మహా వీరుని పరాక్రమాన్ని, ధైర్యాన్ని, చేతి నేర్పును పలుసార్లు మెచ్చుకున్నారు. కాళ్లచేత త్రొక్కబడిన కాలసర్పాలవలె పట్టరాని రోషంతో భయంకరాకారాలతో విజృంభించారు.

రాజ్యాన్ని కాపాడడంలో తన ధైర్య సాహసాలను చూపాడు. ఏమాత్రం వెనుకడుగు వేయకుండా వీరోచితంగా పోరాడాడు. నాయకుడు ధైర్యవంతుడై ఉండాలి. కష్టాల మధ్య వెనక్కి తగ్గకూడదు.

2.5. వినయం

భగవంతుడు ప్రత్యక్షమైనప్పుడు ధ్రువుడు ఏ రాజ్యమూ కోరలేదు. అతను కేవలం "భగవంతుని సేవ" మాత్రమే కోరుకున్నాడు. ఇది అతని వినయాన్ని సూచిస్తుంది.

> **తే. అంత నా సజ్జనాగ్రణి యైన ధ్రువుఁడు, దల్లులకు భక్తి వినతులు దగ వొనర్చి**
> **సురుచికిని మ్రొక్క సర్వకుఁ జూచి యెత్తి నగు మొగంబున వాలింగనంబు సేసి. (పోతన 79)**

తరువాత వినయశీలుడై ధ్రువుడు తల్లులకు భక్తితో నమస్కరించాడు. సురుచి, తనకు మ్రొక్కిన ధ్రువుణ్ణి లేవనెత్తి నవ్వుతూ అక్కున చేర్చుకున్నది.

ధ్రువుడు సురుచి పలికిన పలుకులకు కలత చెందాడే కానీ పినతల్లిని ఎదిరించలేదు. తల్లి, తండ్రి, పినతల్లి, నారదుడు... ఎవరైనా పెద్దల పట్ల ధ్రువుడు వినయాన్నే చూపాడు. భగవంతుని దర్శనానంతరం ఇంటికి వచ్చిన ధ్రువుడు తల్లిదండ్రులతో పాటు పినతల్లికి కూడా కాళ్లు మొక్కుతాడు.

2.6. ప్రజాహితం

నాయకుడు అధికారం కోసం కాకుండా సేవా భావంతో ముందుకు రావాలి. రాజ్యాన్ని అధిరోహించిన తరువాత ధ్రువుడు న్యాయపాలన చేశాడు. ఆయన ప్రజలను రక్షించి, ధర్మపాలకుడిగా నిలిచాడు.

> **వ. "ఇట్లు సుశీల సంపన్నుండును, బ్రహ్మణ్యుండును, ధర్మపేతురక్షకుండుము,**
> **దీనవత్సలుండు నయి యవనిఁబాలించు ధ్రువుండు దన్నుఁ బ్రజలు....." (పోతన 93)**

ఈ విధంగా ధ్రువుడు శీలసంపన్నుడు, బ్రహ్మణ్యుడు, ధర్మసేతు రక్షకుడు, దీనబాంధవుడు అయి రాజ్యాన్ని పరిపాలించాడు. ప్రజలు అతనిని తండ్రిగా భావించారు. పుణ్యంకొలదీ భోగాలు అనుభవించాడు. అశుభశాంతి కోసం దేవతలను ఉద్దేశించి యాగాలు ఆచరించాడు. ఇది ఒక ఆదర్శ నాయకుని రూపం.

2.7. ధ్రువుని రాజ్యపాలన

భగవంతుని దర్శనానంతరం ధ్రువుడు తన రాజ్యానికి తిరిగి వచ్చి సింహాసనం అధిరోహించాడు. చిన్న వయస్సులోనూ ఆయన పాలనలో మూడు ముఖ్యాంశాలు కనిపిస్తాయి:

- ధర్మపాలన – ధర్మమే పాలనకు కేంద్రబిందువు.
- ప్రజాహితం – ప్రజల సుఖదుఃఖాలను తనవిగా భావించాడు.
- సమానత్వం – తల్లి సునీతీ అవమానాన్ని గుర్తుచేసుకుని, ఏ పౌరునికీ తక్కువతన భావన రాకుండా పాలన చేశాడు.

> **వ. " ప్రజలు దండ్రి యని తలంప నిరువది యాఱువేలేండ్లు. భోగంబులచేతం**
> **బుణ్యక్షయంబును, నభోగంబులైన యాగాదులచే నశుభక్షయంబునుం జేయుచు**
> **బహుకాలంబు దనుకఁ ద్రివర్గ సాధనంబుగ రాజ్యంబు సేసి కొడుకునకుం బట్టంబుగట్టి**
> **యచలి తేంద్రియుండై యవిద్యారచిత స్వప్నగంధర్వ నగరోపమం బయిన దేహాదికంబగు**
> **విశ్వంబు భగవ న్మాయారచితంబని యాత్మం దలంచుచు వెండియు." (పోతన 93)**

ప్రజలు ధ్రువుడిని తండ్రిగా భావించారు. ధ్రువుడు ఇరువది ఆరువేల సంవత్సరాలు రాజ్యం చేశాడు. ధర్మార్థ కామాలు అనే త్రివర్గాన్ని సాధించాడు. కొడుకుకి పట్టాభిషేకం చేశాడు. చతుర్విధ పురుషార్థాలను ధర్మబద్ధంగా నిర్వహించాడు. ఈ పద్యం రాజ్యపాలనలోని ధ్రువుని నాయకత్వాన్ని స్పష్టంగా చూపుతుంది.

ఉపసంహారం

ధ్రువుని కథ నుండి మనకు అనేక నాయకత్వ పాఠాలు లభిస్తాయి:

- తమను అవమానించిన వారిపై ప్రతీకారం తీర్చుకోవాలని నేటి యువత ప్రయత్నిస్తుంది. కానీ అవమానాన్ని విజయానికి మెట్లలా మార్చుకోవచ్చని ధ్రువోపాఖ్యానం తెలుపుతుంది.
- గురువు ఉన్నవారు గురుభక్తితో ఆయన చెప్పినట్లు నడుచుకుని సరైన మార్గదర్శకత్వం పొందగలిగినవాడే సఫలీకృతుడు అవుతాడని ధ్రువోపాఖ్యానం నిరూపించింది.
- సంకల్పబలం ఉన్నవారికి వయస్సు, పరిస్థితులు అడ్డంకులు కావు. సంకల్పబలంతో ప్రయత్నిస్తే విజయం తథ్యమని ధ్రువోపాఖ్యానం విశదపరిచింది.
- నాయకత్వానికి వినయం, సేవాభావం అవసరం.
- నాయకత్వం అనేది స్వప్రయోజనం కోసం కాదు. అది సమాజానికి సేవ చేయడానికే. ఇన్ని సుగుణాలు ఉన్నందున ధ్రువుడు కేవలం పురాణ పాత్రగానే కాకుండా నాయకత్వానికి శాశ్వత ఆదర్శంగా నిలిచాడు.
- ధ్రువుని నాయకత్వం సంకల్పబలం, గురుభక్తి, దైవభక్తి వంటి ఉన్నత గుణాలపై ఆధారపడి ఉంది.
- కష్ట సమయాలలో ధైర్యం, పెద్దల పట్ల వినయం నాయకుడికి అవసరమైన లక్షణాలు.
- ప్రజా సంక్షేమం, ధర్మబద్ధమైన పరిపాలన ఒక ఆదర్శవంతమైన నాయకుడి ప్రాథమిక బాధ్యతలు.
- ఈ గుణాల కలయిక ధ్రువుడిని ఒక శాశ్వత నాయకత్వ ఆదర్శంగా నిలిపింది.

ఉపయుక్త గ్రంథసూచి

1. పోతన, బమ్మెర. *ఆంధ్ర మహాభాగవతము*. తెలుగు అకాడమీ హైదరాబాద్.
2. పోతన, బమ్మెర. *పోతన భాగవతము, రెండవ సంపుటి*. తిరుమల తిరుపతి దేవస్థానము, 2010.
3. రాఘవన్, వి. *Bhagavata Purana: A Study*. మద్రాస్ యూనివర్సిటీ, 1969.
4. రావు, వి. "Bhakti and Leadership in Pothana Bhagavatam." *Journal of Telugu Studies*, vol. 12, no. 3, 2015, pp. 45–67.

5. రెడ్డి, కె.ఎన్. "Leadership and Devotion: The Dhruva Narrative in Telugu Bhāgavata Tradition." *Journal of South Asian Literature*, vol. 34, no. 2, 2008, pp. 45–62.
6. శర్మ, ఎ. *Leadership in Indian Epics: A Comparative Study*. భారతీయ విద్యాప్రకాశన్, 2018.
7. సుబ్రహ్మణ్యం, పి. "Leadership in Purāṇas:." *Indian Journal of Philosophy*, vol. 22, no. 2, 2007, pp. 89–104.

***

గమనిక: ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.
వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.